సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 09.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 197
పేజీలు: 08 వెల: రూ. 5

# మూసీ పునరుజ్జీవనం

## అభివృద్ధి – ప్రజా హితం లక్ష్యంగా ప్రాజెక్టు పనులు

- అభివృద్ధి పేరుతో ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా చర్యలు
- సామాజిక బాధ్యత పునరుజ్జీవం
- ప్రజల అనుమానాలు నివృత్తి చేసేలా కార్యచరణ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ప్రజల భాగస్వామ్యంతోనే మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని నిర్ణయించింది. మిగతా 02లో



## విద్యా, పరిశ్రమల
# హబ్‌గా కొడంగల్

### ఏడాదిలో కొడంగల్, నారాయణ పేట లిఫ్ట్ పూర్తి

- 15 రోజుల్లో భూసేకరణ పూర్తి
- రెండు నెలల్లో కృష్ణ, వికారాబాద్ రైల్వే లైన్
- టేకులకోడ్ సమీపంలో సిమెంట్ పరిశ్రమ
- లగచెర్ల ప్రాంతంలో విద్యా హబ్
- ముంబై, పూనా తరహాలో కొడంగల్, హైదరాబాద్ రహదారి
- అభివృద్ధి అంటే కొడంగల్ గురించి చర్చించుకోవాలి
- దేశానికే రోల్ మోడల్ కొడంగల్
- కొడంగల్ లో పర్యటన లో సీఎం రేవంత్ రెడ్డి



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**
ఏడాది లోగా కొడంగల్– నారాయణ పేట ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగు నీరు అందించి ఈ ప్రాంతాన్ని సస్యశామలం చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కొడంగల్‌లో రూ. 110 కోట్ల వ్యయం తో శ్రీ మహాలక్షి వెంకటేశ్వర ఆలయం పునర్ నిర్మాణానికి సీఎం భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఎన్నో ఏళ్లుగా నారాయణ పేట, కొడంగల్ ప్రాంతాలు సాగునీటి సమస్య తో సతమతమవుతున్నాయని, ఈ ప్రాంతానికి పెద్ద పదవులు లేకపోవడంతో అభివృద్ధి జరగలేదని, ఇక్కడి నుంచి ఎమ్మెల్యే గా గెలిచి ముఖ్య మంత్రి పదవి చేపట్టానని, మీ ఆశీర్వాదంతో పెద్ద పదవి చేపట్టి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. సీఎంగా బాధ్యత చేపట్టిన వెంటనే పదేళ్లు బీఆర్ఎస్ పాలనలో తొక్కి పెట్టిన కొడంగల్, నారాయణ పేట లిఫ్ట్ పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక మిగతా 02లో

# పాపం విజయ్..!

### సీఎం కుర్చీ ముందు విజయ్‌కు రాజకీయ షాక్! ప్రమాణ స్వీకారం వాయిదా?

- తమిళ రాజకీయాల్లో ట్విస్ట్.. విజయ్ ఆశలకు బ్రేక్
- వేయి కళ్లతో ఎదురుచూసిన అభిమానులకు నిరాశ
- ఐయూఎంఎల్ షాక్.. వీసీకే సైలెన్స్‌తో చిక్కుల్లో విజయ్!
- మద్దతు ఉపసంహరణలతో మళ్లీ మొదటికి
- ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ

**ముద్ర డెస్క్ :**
తమిళ రాజకీయాల్లో సంచలనంగా మారిన టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటుపై మరోసారి అనిశ్చితి నెలకొంది. ఇప్పటికే సీఎం పదవికి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, రేపే ప్రమాణ స్వీకారం జరగబోతుందని అభిమానులు సంబరాలకు సిద్ధమవుతుండగా.. చివరి నిమిషంలో జరిగిన రాజకీయ పరిణామాలు కథను మళ్లీ మొదటికి తీసుకెళ్లాయి. సీఎం కుర్చీ దాదాపు చేతికి అందిందనుకున్న విజయ్‌కు ఇప్పుడు మద్దతు రాజకీయాలే పెద్ద అడ్డంకిగా మారాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కీలకమైన మిగతా 02లో






# బెంగాల్ రిపీట్ | తెలంగాణే టార్గెట్

## పరేడ్ గ్రౌండ్స్ సాక్షిగా మోదీ సమరశంఖం!

- కాషాయం పార్టీకి ఇది కీలక టైం
- మిషన్ 2028: గులాబీని వీడేలా.. కమలం విరిసేలా..
- బీజేపీ 'సైలెంట్ ఆపరేషన్'!
- స్థానిక లీడర్లపై బీజేపీ భారీ ఆశలు
- కిందిస్థాయి నుంచి చేరికలకు వ్యూహం
- రాజకీయం మారిపోతుందా?

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని మోడీ తెలంగాణకు వస్తున్నారు. అయితే, గతంలో పర్యటన.. ఈ సారి పర్యటనకు చాలా డిఫరెన్స్ ఉందని రాజకీయ వర్గాల టాక్. అనుకున్నట్టే బలం లేని చోట బీజేపీ బలం సాధించుకుంటోంది. కోటగోడలను బద్దలు కొడుతోంది. ఒక్కో అడుగు వేసి పాగా వేస్తోంది. పశ్చిమ బెంగాల్ కోటను బద్దలు కొట్టిన బీజేపీ అధిష్టానం, ఇప్పుడు తన విజయ యాత్రను దక్షిణ భారతం వైపు మళ్లించింది. 15 ఏళ్ల కిందట బెంగాల్‌లో నామ మాత్రంగా ఉన్న శక్తి, నేడు 207 సీట్లతో అధికారాన్ని కైవసం చేసుకోవడం వెనుక ఉన్న సైలెంట్ ఆపరేషన్ వ్యూహాలను ఇప్పుడు తెలంగాణలో అమలు చేసేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మే 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న సభ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు శంఖారావం పూరించబోతున్నారు.

**బెంగాల్ మోడల్ తెలంగాణలో!**

బెంగాల్‌లో మమతా బెనర్జీ వంటి ఉద్దండురాలిని ఓడించడం ద్వారా బీజేపీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం నెలకొంది. అదే తరహాలో తెలంగాణలో ఇప్పటికే ఉన్న ఎనిమిది మంది ఎంపీల బలంతో, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని మోదీ–షా ద్వయం భావిస్తోంది. బెంగాల్ గెలవగలిగితే.. తెలంగాణ ఎందుకు సాధ్యం కాదు అనే నినాదంతో బీజేపీ ముందుకు వెళుతోంది. ఈ సభ ద్వారా సుమారు 8,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తూనే, రాజకీయ మార్పుకు మోదీ పిలుపునివ్వనున్నారు.

**పరేడ్ గ్రౌండ్స్ సాక్షిగా..**

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో గెలవబోయేది తామేనని మోదీ ఈ సభ ద్వారా అధికారికంగా ప్రకటించబోతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయం కేవలం బీజేపీయేనని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ఈ సభ ప్రధాన ఉద్దేశ్యం. ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ వంటి నేతలు టీమ్ మోదీ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వికసిత్ తెలంగాణ నినాదంతో ఇప్పటికే ప్రజల్లోకి వెళ్లిన పార్టీ, ఇప్పుడు మోదీ సభతో పీక్ స్టేజ్‌కు చేరుకోవాలని చూస్తోంది.

**సైలెంట్ ఆపరేషన్**

బెంగాల్‌లో ఎలాగైతే కిందిస్థాయి ఓటర్లను మచ్చిక చేసుకున్నారో, తెలంగాణలోనూ అదే తరహా సైలెంట్ ఆపరేషన్ ప్రారంభమైంది. ఇతర పార్టీల అసంతృప్త నేతలను చేర్చుకోవడం, కుల సమీకరణలను సరిదిద్దడం, కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్ వంటి వాటిని ఇంటింటికీ తీసుకెళ్లడం ద్వారా ఓటు బ్యాంకును పటిష్టం చేయాలని భావిస్తున్నారు. ముఖ్యంగా యువత, మహిళా ఓటర్లను టార్గెట్ చేస్తూ బీజేపీ సోషల్ మీడియా సైన్యం రంగంలోకి దిగింది. బీజేపీ అంచనా ప్రకారం, దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పార్టీకి అత్యంత అనుకూలమైన రాష్ట్రం తెలంగాణ. ఇక్కడ ఇప్పటికే బలమైన ఓటు శాతం ఉండటం, నాయకత్వం చురుగ్గా ఉండటం వల్ల కొంచెం కష్టపడితే అధికారం సాధ్యమని అమిత్ షా బృందం లెక్కలు వేస్తోంది. బెంగాల్ విజయం అందించిన ఊపుతో, తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కారు ఆవశ్యకతను మోదీ తన ప్రసంగంలో నొక్కి చెప్పనున్నారు.

**రాజకీయాల్లో కొత్త మలుపు!**

మోదీ మే 10 పర్యటన కేవలం అభివృద్ధి పనుల ప్రారంభానికే పరిమితం కాదు. ఇది తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఒక భారీ బహిరంగ సభ. బెంగాల్ ఓటమితో ప్రతిపక్ష ఇండియా మిగతా 02లో

## అర్జీల పరిష్కారంలో
# బ్రాండ్ తెచ్చుకోవాలి

### ఇకపై ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా పీజీఆర్ఎస్

- ప్రతీ శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డే
- సత్వర ఫైళ్ల క్లియరెన్సుతో సత్వర సేవలు
- ప్రజల సమయాన్ని వృథా చేయొద్దు
- టెక్నాలజీని వినియోగించండి.. మానవీయ కోణంతో వ్యవహరించండి
- 7వ రోజు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

04



## 800 ఏళ్ల నాటి శివాలయం
# కూల్చివేత



- ఆలయం కూల్చివేతపై హోరెత్తిన ఓరుగల్లు
- ఘటనపై కేసు నమోదు చేసిన అధికారులు
- మళ్లీ అదే ప్రాంతంలో నిర్మిస్తామని కలెక్టర్ క్లారిటీ

04

## విద్యార్థులకు ఏఐ,
# నైపుణ్య శిక్షణ

### ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో డిగ్రీ కళాశాలలు



- మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు
- మూసీ అభివృద్ధిలో గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారాల నిర్మాణం
- మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

03

## ప్రాణాలు బలిగొన్న ప్రేమ

### బీటెక్ విద్యార్థిని వెంటాడి, కత్తులతో పొడిచి దారుణ హత్య.!

- చిలకలగూడలో దారుణం..
- ఏడుగురు యువకులతో దాడి..
- తల, మెడపై 15 కత్తిపోట్లు.. అక్కడికక్కడే మృతి

03



# బెంగాల్ సీఎంగా సువేందు


### మమతకు డబుల్ షాక్.. బెంగాల్ సీఎం కుర్చీపై తన అనుచరుడే

- కౌన్సిలర్ నుంచి సీఎం వరకు
- సువేందు ప్రయాణం అమోఘం
- నందిగ్రామ్ హీరో నుంచి సీఎంగా..
- సువేందు అధికారి సెన్సేషన్
- తృణమూల్‌ను వీడి చరిత్ర సృష్టించిన సువేందు

04



## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 09.05.2026
www.mudranews.in | @mudranews



## గ్రీన్ టీ తాగేందుకు సరైన సమయం



గ్రీన్ టీ తాగడానికి భోజనానికి గంట ముందు లేదా గంట తర్వాత సరైన సమయం. దీనివల్ల ఆహారంలోని పోషకాలు శరీరానికి అందడంలో ఎలాంటి ఆటంకం ఉండదు.

# పాపం విజయ్!




(మొదటి పేజీ తరువాయి)

మద్దతు విషయంలో అనూహ్య మలుపులు చోటుచేసుకోవడంతో లోక్ భవన్‌లో తీవ్ర గందరగోళం నెలకొన్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (IUML) మద్దతు ఉపసంహరించుకోవడం విజయ్ శిబిరానికి పెద్ద షాక్‌గా మారింది. మరోవైపు విజయ్‌కు మద్దతుగా నిలుస్తుందని ప్రచారం జరిగిన వీసీకే కూడా ఇప్పటివరకు అధికారిక లేఖ ఇవ్వకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. దీంతో రేపు జరగాల్సిన ప్రమాణ స్వీకార కార్యక్రమం వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అయితే దీనిపై రాజ్‌భవన్ నుంచి కానీ, విజయ్ శిబిరం నుంచి కానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ అధికార వర్గాల్లో మాత్రం 'సంఖ్యాబలం ఇంకా స్పష్టంగా లేకపోవడంతో గవర్నర్ వేచి చూసే ధోరణిలో ఉన్నారు' అన్న చర్చ బలంగా వినిపిస్తోంది.

ఇప్పటికే తమిళ రాజకీయాల్లో వరుస ట్విస్టులతో ఉత్కంఠ పెరిగిన వేళ.. విజయ్ అభిమానులు మాత్రం తీవ్ర నిరాశలో ఉన్నారు. రాజకీయాల్లో కొత్త ప్రత్యామ్నాయంగా ఎదిగిన తమ హీరో ఇప్పుడు నిజంగానే సీఎం అవుతారని ఆశించిన అభిమానులు సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఇంత దగ్గరికి వచ్చి మళ్లీ వెనక్కి వెళ్లడం దురదృష్టం' అంటూ పోస్టులు పెడుతున్నారు.

మరోవైపు ప్రత్యర్థి పార్టీల నేతలు మాత్రం విజయ్ అనుభవలేమిని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. 'సినిమా స్టేజ్ ఒకటి.. రాజకీయాలు మరోటి' అంటూ ఎద్దేవా చేస్తున్నారు. అయితే విజయ్ అనుచరులు మాత్రం చివరి వరకూ పోరాటం కొనసాగుతుందని, మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ఇంకా జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇప్పుడు అందరి చూపు ఒక్కటే.. విజయ్‌కు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ దొరుకుతుందా? అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్న సీఎం ప్రమాణ స్వీకారం జరుగుతుంది? తమిళ రాజకీయ చదరంగంలో తదుపరి ఎత్తు ఏమిటన్నదే హాట్ టాపిక్‌గా మారింది.

## దేశరక్షణకు ఆయువు పట్టు హైదరాబాద్




**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్ దేశ రక్షణ రంగానికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధిస్తోందని, 2024–26 మధ్య ఎగుమతుల్లో 103 శాతం సంయుక్త వార్షిక వృద్ధి నమోదు కావడం గర్వకారణమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1500కు పైగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రక్షణ రంగానికి భాగస్వాములుగా పనిచేస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన ఎంఎస్‌ఎంఈ స్పార్క్–3.0 కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, భారత్ ఇప్పుడు 100కు పైగా దేశాలకు రక్షణ సామగ్రిని ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. దేశ రక్షణ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వాలే బలమైన పునాదులు వేసాయని అన్నారు. రక్షణ ఎగుమతులు రూ.686 కోట్ల నుంచి రూ.23,622 కోట్లకు పెరగడం దేశ పురోగతికి నిదర్శనమన్నారు.ఏఐ, డ్రోన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి వెల్లడించారు.

# బెంగాల్ రిపీట్.. తెలంగాణే టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

కూటమి నైతిక దెబ్బతిన్న తరుణంలో, ఆ గ్యాప్‌ను క్యాష్ చేసుకోవాలని బీజేపీ చూస్తోం ది. పరేడ్ గ్రౌండ్స్ గర్జన తర్వాత తెలంగాణ రాజకీయాలు మరోసారి త్రిముఖ పోరు నుంచి బీజేపీ వర్సెస్ అదర్స్ గా మారే అవకాశం కనిపిస్తోంది.

**స్థానికం నుంచే బీజేపీ ఆపరేషన్ ఆకర్ష్**

బీజేపీ ఇప్పుడు కొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా 8 స్థానాలను కైవసం చేసుకుని, ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకున్న కమలదళం, ఇప్పుడు మిషన్ 2028 లక్ష్యంగా పావులు కదుపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే కాకుండా, బీఆర్ఎస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసేలా బీజేపీ అగ్రనాయకత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

**బీఆర్ఎస్ ఖాళీయే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్**

తెలంగాణలో పదేళ్లపాటు చక్రం తిప్పిన బీఆర్ఎస్ ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఓటమి తర్వాత ఆ పార్టీ నుంచి వలసలు కొనసాగుతుండగా, వాటిని తమ కు అనుకూలంగా మార్చుకోవడంలో బీజేపీ విఫలమవుతోంది. కానీ ఇప్పుడు రూటు మార్చాలనుకుంటోంది. నియోజకవర్గస్థాయి నేతలు లేకపోవడం ఆ పార్టీకి సమస్యగా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, బలమైన కేడర్‌ను ఆకర్షించడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని డిసైడయింది. బీఆర్ఎస్ రాజకీయ ఉనికి ముగిసింది అనే సంకేతాలను ప్రజల్లోకి బలంగా పంపడం ద్వారా, ఆ పార్టీ ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది.

**క్షేత్రస్థాయి వ్యూహాలు**

బీజేపీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక నేతలుగా ఉన్న ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ భిన్నమైన వ్యూహాలతో పనిచేస్తున్నారు. బీఆర్ఎస్ అంతర్గత పరిణామాలు తెలిసిన ఈటల, ఆ పార్టీలోని అసంతృప్త నేతలతో టచ్‌లో ఉంటూ ఆపరేషన్ ఆకర్ష్ ను పర్యవేక్షిస్తుండగా.. బండి సంజయ్ తనదైన శైలిలో హిందూత్వ ఎజెండా, యువతను ఆకట్టుకునే లా క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటూనే, బలహీనంగా ఉన్న దక్షిణ తెలంగాణలో పార్టీని విస్తరించడమే వీరిద్దరి ప్రధాన లక్ష్యం.

**తెలంగాణలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ పాలిటిక్స్?**

రాష్ట్రంలో ఇప్పుడు రాజకీయాలు క్రమంగా ద్వైపాక్షికంగా మారుతున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా ఉన్న పోరు, ఇప్పుడు కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా రూపాంతరం చెందుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బలం, రాష్ట్రంలో పెరుగుతున్న ప్రజాదరణను చూపిస్తూ.. భవిష్యత్తులో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఏకైక శక్తి బీజేపీయేనని నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఉనికిని క్రమంగా దెబ్బతీస్తూ, ఆ పార్టీకి ఉన్న ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని ఆక్రమించేందుకు కమలనాథులు సిద్ధమయ్యారు.

**బీఆర్ఎస్ సమస్యలు. బీజేపీకి ప్లస్ అవుతాయా ?**

బీఆర్ఎస్ నుంచి వలసలు పెరగడం వల్ల ఆ పార్టీ కేడర్ చెల్లాచెదురవుతోంది. గతంలో కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన ఓటర్లు ఇప్పుడు బీఆర్ఎస్‌ను బలహీనంగా భావించి, కమలం వైపు చేరుతారని నమ్ముతున్నారు. 2028 నాటికి తెలంగాణలో అధికారం చేపట్టడం అసాధ్యం కాదని పార్టీ గట్టి నమ్మకంతో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో బీజేపీ గ్రాఫ్ పెరుగుతున్న మాట వాస్తవం. పార్లమెంట్ ఫలితాల జోష్‌ను అలాగే కొనసాగించి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తేనే మిషన్ 2028 విజయవంతం అవుతుంది. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా దెబ్బతీసి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీజేపీ ఎంతవరకు సఫలమవుతుందనే దానిపైనే ఆ పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

# విద్యా, పరిశ్రమల హబ్‌గా కొడంగల్



(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం చేశానన్నారు. ఈ లిఫ్ట్ పనులు మీరో ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే భూసేకరణ పనులు కొలిక్కి వచ్చాయని, ఇంకా కొన్ని చోట్ల భూ సేకరణ పనులు పూర్తి చేయాల్సి ఉందని సీఎం పేర్కొన్నారు. ఈ పనులు 15 రోజుల్లో పూర్తి చేసేందుకు మంత్రి వాకిటి శ్రీహరికి అప్పగిస్తున్నానని ప్రకటించారు. భూమి సేకరించే గ్రామాల్లో మంత్రి పర్యటించి రైతులతో మాట్లాడి లిఫ్ట్ పనులకు అడ్డంకులు లేకుండా చూసే బాధ్యత మంత్రి శ్రీహరి దే అని సీఎం అన్నారు.రైతులకు భూ పరిహారం అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉన్నామని, అర్ధరాత్రి నిద్ర లేపి అడిగినా భూ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే తన లక్ష్యం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్లుగా జీవచ్ఛవంలా పడిఉన్న కొడంగల్ లిఫ్ట్ కు రేవంత్ రెడ్డి జీవం పోసినట్లు అయింది. దీంతో సాగు నీరు లేక అల్లాడిపోతున్న ఇక్కడి రైతాంగానికి సీఎం తీపి కబురు చెప్పడంతో రైతులు సంబర పడ్డారు.

**టేకులకోడ్ వద్ద సిమెంట్ పరిశ్రమ**

కొడంగల్ ప్రాంతం విద్యా, పరిశ్రమల హబ్‌గా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎం ప్రకటించారు.ఈ ప్రాంతంలో సున్న పురాయి అధికంగా ఉందని, ఇక్కడి నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తారని, దీంతో ఈ ప్రాంత రహదారులన్నీ గుంతలమయంగా మారుతున్నాయని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు తరలించడం వల్ల ఈ ప్రాంతానికి నష్టమే కానీ లాభం లేదు. అందుకే టేకులకోడ్ వద్ద సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసి ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం తెలిపారు. 6 నెలల్లో పరిశ్రమ పనులు పూర్తవుతాయన్నారు.

**లగచర్ల ప్రాంతంలో విద్యా హబ్**

లగచెర్ల ప్రాంతంలో విద్యా హబ్ ను ఏర్పాటు చేస్తామని, ఇక్కడ కేజీ టూ పీజీ వరకు విద్యార్థులు చదువుకునేందుకు అన్నీ సౌకర్యాలు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికే ఈకొడంగల్ ప్రాంతంలో మెడికల్, ఇంజినీరింగ్, ఐఐఐటీ, పాల్ టెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యను అందిస్తున్నామని సీఎం అన్నారు.విద్యలో వెనుకబడిన కొడంగల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.



**కృష్ణ, వికారాబాద్ రైల్వే లైన్ పూర్తి చేస్తా**

ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న కృష్ణ, వికారాబాద్ రైల్వే లైన్ పనులు రెండు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎం పేర్కొన్నారు. ఇందుకోసం కేంద్ర ఆమోదం లభించిందని, వెంటనే పనులు పూర్తవుతాయన్నారు. ఈ రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే కొడంగల్ ప్రాంతంలో ట్రాన్స్ పోర్ట్ వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు.

**2034 వరకు మనదే అధికారం**

2034 వరకు మనమే అధికారంలో ఉంటామని, కొడంగల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఒకప్పుడు ఈ నియోజకవర్గం లోని తండాలు కనీస సౌకర్యాలకు నోచుకోలేదని, తాను మొదట్లో కొడంగల్ ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రతి తండా కు రోడ్ల సౌకర్యం కల్పించామన్నారు. ప్రస్తుతం గ్రామాలకు ధీటుగా తండాలు అభివృద్ధి చెందాయన్నారు. ఇప్పటి నుంచి సర్పంచ్‌లు రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఎంతో ఉందన్నారు. కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధిలో నడిపించేందుకు రాష్ట్ర మంత్రుల సహకారంతో ముందుకెలుతున్నానని సీఎం పేర్కొన్నారు. ఇక్కడి రహదారులను ముంబై, పూణే రహదారుల్లా మార్చుతానన్నారు. ఇక్కడి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు నేరుగా వెళ్లేందుకు రహదారి నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. అభివృద్ధి అంటే కొడంగల్ లో చూడాలని ప్రతిఒక్కరూ అనుకునే విధంగా మార్చుతానని సీఎం అన్నారు. అందు కే ఇకనుంచి ఈ నియోజకవర్గంలో గుంపులు కట్టి రాజకీయం చేయకుండా ప్రతి ఒక్కరూ ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజ నర్సింహా, వాకిటి శ్రీహరి,పరిగి ఎమ్మెల్యే రాం మోహన్ రెడ్డి, ము న్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే మూసీ పునరుజ్జీవనం

(మొదటి పేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారలతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం నది ప్రక్షాళన మాత్రమే కాదనీ అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తి స్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది."మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి–ప్రజా హితం' సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటీ అధికారులకు దిశ నిర్దేశం చేసింది.

**మంత్రుల దిశానిర్దేశం..**

మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్ –1 సుమారు రూ.7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చుకునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ –1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను



ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు.

మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణాం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డీపీఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు. ఈస్ట్–టు–వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి – గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన గడువు నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించాడానికి లక్ష్యంగా పెట్టుకొవాలన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్నారు.. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్‌ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టైంలైన్ నిర్దేశించుకొని స్పష్టమైన పురోగతి కనిపించే విధంగా పనుల నిర్మాణం జరుగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఏలాంటి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో సాంకేతికపరమైన అంశాలలో ఐఐటి, జెఎన్ టియూ సంస్థల నుంచి తగిన సహాకారం తీసుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.

**రబ్బర్ డ్యాం నమూనాల పరిశీలించిన మంత్రులు**

మూసీ పునర్జీవం ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధిలో భాగాంగ నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచడం, జలక్రీడలు, మరియు బోటింగ్ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు తిలకించారు. నాసిక్, ముంబాయి నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేసిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి తగిన అధ్యయనం చేసిన తరువాత నివేధిక ఇవ్వాలని అధికారులను మంత్రులు అదేశించారు. ఈ సమావేశంలో మెట్రో పాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణా భాస్కర్, వాటర్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 09.05.2026
www.mudranews.in | @mudranews



## గ్రీన్ టీతో బరువు తగ్గుదల :



ఇందులో ఉండే 'కాటెచిన్స్' మరియు 'కెఫీన్' మెటబాలిజంను వేగవంతం చేస్తాయి. ఇది శరీరంలోని అదనపు కొవ్వును కరిగించి బరువు తగ్గడానికి అద్భుతంగా సహాయపడుతుంది.

# రైతులు కష్టాల్లో ఉంటే రాజకీయం చేయడం తగదు

- నాడు వరి ఏస్తే ఊరే అన్న కేసీఆర్..
- రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు అధిగమించాలంటే ఫ్యూచర్ సీటీ అవసరం
- తడిసిన మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేస్తాం
- జగిత్యాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి అడ్లూరి



**ముద్ర, జగిత్యాల:** రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో రాజకీయాలు చేయడం తగదని, రాష్ట్రంలోని రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం రాత్రి జగిత్యాల జిల్లాలో కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను జగిత్యాల మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం పరిశీలించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా పంటలకు మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యేటా రూ. 4 వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోరి ముందుకు సాగుతుందని తెలిపారు. జగిత్యాల జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే పెద్ద ఎత్తున పంట దిగుబడులు వచ్చాయని తెలిపారు. జగిత్యాల మార్కెట్ యార్డులో 487 మంది రైతుల వద్ద 1151 మెట్రిక్ టన్నుల మక్కలు సేకరించగా ఈ ఏడాది ఇప్పటికే 697 మంది రైతుల వద్ద 2607 మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేసినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యంతో పాటు మక్కజొన్నలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కొంతమంది ప్రతిపక్ష నాయకులు తమ స్వార్థ రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నారని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రైతులను ఏనాడు పట్టించుకోలేదని అన్నారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రైతులు వరి సాగు చేస్తే ఊరే అని అన్నారని అప్పుడు జిల్లా మంత్రిగా ఉన్న ఒక నాయకుడు ధాన్యం క్వింటాలుకు నాలుగు నుంచి ఎనిమిది కిలోల అదనపు తూకం వేస్తే రైస్ మిల్లర్ వద్దకు వెళ్లి మాట్లాడుకోవాలని అన్న మాటలను గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ముందుచూపుతో ముఖ్యమంత్రి ఫ్యూచర్ సిటీకి అభివృద్ధి చేస్తున్నారని ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా రాష్ట్రానికి వివిధ పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుందని అన్నారు. జిల్లాలోని వరి, మొక్కజొన్న రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని మార్కెట్ యార్డుల్లో ఉన్న చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నందయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## చిన్న జిల్లాలైనా సమస్యలకు పరిష్కారం లేదు

- మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్




**ముద్ర, హైదరాబాద్ :** చిన్న జిల్లాలు ఏర్పాటు చేస్తే సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని భావించామని, కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానిం చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిం చిన దిశ సమావేశం లో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన జిల్లాలోని పలు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను స్థానికంగా నివసిస్తున్న పేదలకే కేటాయించాలని సూచించినట్లు చెప్పారు. అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం జిల్లాలో సరిగా అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో కరెంటు వైర్లు లూజ్‌గా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ శాఖ అధికారులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలని కోరినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పలు రకాల రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, బ్యాంకర్ల నియమ నిబంధనల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. గ్యారంటీల పేరుతో ప్రజలను వేధించొద్దని సూచించినట్లు తెలిపారు. అలాగే జవహర్‌నగర్, బాలాజీనగర్ డంప్‌యార్డ్ సమస్యపై ఇప్పటికే ముఖ్యమంత్రిని కలిసినట్లు వెల్లడించారు. త్వరలో స్థానికంగా జేఏసీ సమావేశం నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ స్పష్టం చేశారు.

## కేంద్ర నిధులతోనే గ్రామ పంచాయతీల మనుగడ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో నేటికీ కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతోనే గ్రామ పంచాయతీలు మనుగడ సాగిస్తున్నాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ నెల 10న తెలంగాణకు వస్తున్న ప్రధాని మోడీ రాష్ట్రానికి ఏం తెస్తున్నారని కొందరు మాట్లాడుతున్నారన్నారు. నేడు కేంద్ర నిధులతోనే పంచాయతీలు నడుస్తున్నాయనేది వాస్తవం కాదా అని ఈటల ప్రశ్నించారు. కేంద్ర మద్దతే లేకపోతే రాష్ట్రానికి నిధులు ఎలా వస్తాయని నిలదీశారు. ఈ నెల 10న బీజేపీ బహిరంగ సభ జరగనున్న పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించి, మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అరాచక పాలనకు ప్రజలు గతంలోనే బుద్ధి చెప్పారని, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రాబోయే ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని చిత్తుగా ఓడించి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఆ మార్పు బెంగాల్ ఫలితాల తరహాలోనే ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ మొదటి లక్ష్యం జీహెచ్ఎంసీ ఎన్నికలని, ఆ తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ, అసెంబ్లీ ఎన్నికలని ఈటల స్పష్టం చేశారు.

# విద్యార్థులకు ఏఐ, నైపుణ్య శిక్షణ

- ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నైపుణ్య శిక్షణాభివృద్ధి కోర్సులతో డిగ్రీ కళాశాలలు
- మైనారిటీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, వాటిలో నైపుణాభివృద్ధి, ఏఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మైనారిటీ సంక్షేమ శాఖపై సీఎం శుక్రవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థు లకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3కి ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి, ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమానికి గ్రూప్స్‌కు ఎంపికైన



వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్య, క్రీడల ప్రాధాన్యతను వారికి తెలియజేయాలని సూచించారు. ఇమామ్, మౌజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని ఆదేశించారు. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామని తెలిపారు. గమూసీ రివర్ ఫ్రంట్‌లో ప్రార్థన మందిరాలు మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణలోని గంగా జమునా తెహ్‌జీబ్ ను తెలియజేసేలా ఆ కట్టడాలు ఉండాలన్నారు. సమీక్షలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు) మహ్మద్ షబ్బీర్ అలీ, టీజీఎంఆర్ఈఐఎస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీ, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులామ్ అఫ్జల్ బియాబాని, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మహ్మద్ ఒబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ కొకడాన్, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# వాళ్ళ టార్గెట్ ప్రయాణికులే..

- ఐదుగురు ముఠాగా ఏర్పడి వరుస దొంగతనాలు
- నిందితుల్లో ముగ్గురు మహిళలు
- 9 తులాల బంగారం స్వాధీనం
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మి పెరుమాల్



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులను సిద్దిపేట పోలీసులు అరెస్ట్ చేశారు. సీపీ రష్మీ పెరుమాల్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లాకు చెందిన ఆవుల నాగమణి, ఆవుల లక్ష్మి, కంకణాల మరియమ్మ, యూతం కోటేశ్వరరావు, గంజాబోయిన దినేష్ లు ముఠాగా ఏర్పడి బస్సులు, ఆటోలో ప్రయాణిస్తున్న వారిని టార్గెట్ చేస్తూ బంగారు ఆభరణాలను దొంగతనం చేస్తున్నారని తెలిపారు. గతంలో గుంటూరులో కూడా దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. గత నెల 30న యాదగిరి గుట్ట నుంచి బచ్చన్నపేటలోని బస్ స్టాండ్ లో ఉన్న ప్రయాణికుల వద్ద బ్యాగును చూసిన నాగమణి, లక్ష్మి లు బస్సులో ఎక్కి ప్రయాణికులు బ్యాగు నుంచి బంగారాన్ని తీసుకొని వారు అద్దెకు మాట్లాడుకున్న ఇన్నోవా వాహనంలో పరారయ్యారని తెలిపారు. తిరిగి చేర్యాల కు వస్తున్నా క్రమంలో వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనం విషయం బయటపడడంతో వారి వద్ద నుంచి రెండు తులాల బంగారు గొలుసు, ఏడున్నర తులాల బంగారు కాసుల పేరు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాల్ మాట్లాడుతూ ప్రస్తుతం బంగారం ధర విపరీతంగా పెరగడంతో బంగారం దొంగతనాలు పెరిగిపోయాయన్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లల వద్ద బంగారం ఉండకుండా చూడాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైన 100కు కాల్ చేయాలన్నారు. అవసరం అయితే తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

## ధాన్యం కొనుగోలులో విఫలం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం మహబూబ్ నగర్ మండల పరిధిలోని రాంరెడ్డి గూడెం రైస్ మిల్లు వద్ద ధాన్యం విక్రయించేందుకు వచ్చిన రైతులను కలిసి ఆయన మాట్లాడారు. రైతుల్లో భరోసా నింపేందుకు పాదయాత్ర నిర్వహించాలని అనుకున్నామని, త్వరలోనే పార్టీ ముఖ్య నాయకులతో చర్చించి ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. పాదయాత్ర ద్వారా ప్రతి రైతును కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసం వివరిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, రైతులకు సకాలంలో యూరియా, కరెంటు సరఫరా చేయాలని, సకాలంలో రైతు బందు ఇవ్వాలని, పండించిన పంటను కొనుగోలు చేయడంతో పాటు మద్దతు ధర ఇవ్వాలని, రైతు మరణిస్తే రైతు భీమా ఇవ్వాలని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలనే డిమాండ్ లతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. రైతులు అధైర్య పడవద్దని, ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా పోరాటం చేస్తామని అన్నారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో రైతుల నుంచి మిల్లర్లు ఎక్కువ తరుగు తీస్తున్నారని, రెండు నుంచి మూడు కిలోలు తరుగు తీస్తున్నట్లు చెబుతున్నార న్నారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఆంజనేయులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలు బలిగొన్న ప్రేమ

- బీటెక్ విద్యార్థిని వెంటాడి, కత్తులతో పొడిచి దారుణ హత్య
- చిలకలగూడలో దారుణం




**ముద్ర, హైదరాబాద్:** సికింద్రాబాద్‌లోని చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. ప్రేమ వ్యవహారమే ప్రధాన కారణంగా ఒక యువకుడిని ప్రత్యర్థులు విచక్షణారహితంగా కత్తులతో పొడిచి ప్రాణాలు తీశారు. ఇందిరానగర్ కాలనీలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం అల్వాల్‌లోని యాప్రాల్‌కు చెందిన యువన్ అలియాస్ అఖిల్ (21), మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. యువన్ గతంలో చిలకలగూడలోని ఇందిరానగర్‌లో నివసించేవాడు. అక్కడే ఒక యువతితో ఐదేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ప్రస్తుతం యాప్రాల్‌లో ఉంటున్నప్పటికీ, తరచూ ఆ యువతిని కలిసేందుకు యువన్ చిలకలగూడకు వస్తుండేవాడు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో యువన్ తన మిత్రులతో కలిసి ఇందిరానగర్‌లో మొబైల్ ఫోన్‌లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నాడు. ఆ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై సుమారు ఏడుగురు యువకులు అక్కడికి చేరుకున్నారు. వారు యువన్‌తో గొడవకు దిగి, ఒక్కసారిగా వెంట తెచ్చుకున్న కత్తులతో తల, మెడ, చేతులపై సుమారు 15 చోట్ల కత్తులతో పొడవడంతో యువన్ అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు. నిందితుల్లో సదరు యువతి సోదరులు, స్నేహితులు ఉన్నట్లు సమాచారం. చిలకలగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. యువన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు మూడు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.



**ఉద్యోగులకు అలెర్ట్ : కెఫిన్ పానీయాలను తగ్గించండి**

ఆఫీసులో అలసట కోసం పదేపదే టీ, కాఫీలు తాగడం మానుకోండి. కెఫిన్ ఎక్కువగా ఉండే పానీయాలు శరీరంలోని నీటిని మూత్రం రూపంలో బయటకు పంపి డీహైడ్రేషన్‌కు గురిచేస్తాయి.



## అర్జీల పరిష్కారంలో బ్రాండ్ తెచ్చుకోవాలి

- ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉమ్మడిగా పీజీఆర్ఎస్
- ప్రతీ శుక్రవారం ఫీల్డ్ గ్రీవెన్స్ డే
- సత్వర ఫైళ్ల క్లియరెన్సుతో సత్వర సేవలు
- ప్రజల సమయాన్ని వృథా చేయొద్దు
- టెక్నాలజీని వినియోగించండి...
- మానవీయ కోణంతో వ్యవహరించండి
- 7వ రోజు జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు



**ముద్ర, అమరావతి :**
అర్జీలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన సీఎం, ప్రజల నుంచి వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించి ప్రభుత్వంపై విశ్వాసం పెంచాలని సూచించారు. కొందరు అధికారులు అర్జీలు తీసుకుని పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకూడదన్నారు.

ఇ-ఫైళ్ల క్లియరెన్స్ వేగవంతం కావడం మంచి పరిణామమని పేర్కొన్న సీఎం, ఫైళ్లను త్వరగా పరిష్కరిస్తే ప్రజలకు సేవలు కూడా వేగంగా అందుతాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫైళ్ల క్లియరెన్స్ సమయం 10 రోజుల నుంచి 2 రోజులకు తగ్గిందని వెల్లడించారు. ఇకపై 24 గంటల్లోపు ఇ-ఫైల్స్ డిస్పోజ్ చేసేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం కొత్తగా పీజీఆర్ఎస్ విధానాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు సీఎం తెలిపారు. ప్రతి శుక్రవారం "ఫీల్డ్ గ్రీవెన్స్ డే" నిర్వహించి నియోజకవర్గ స్థాయిలో ప్రజల సమస్యలు స్వీకరించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఆన్‌లైన్ సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తే అవినీతి తగ్గడమే కాకుండా ప్రజల సమయం కూడా ఆదా అవుతుందని సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే 90 శాతం ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని, డిసెంబర్ నాటికి అన్ని సేవలను వాట్సాప్‌లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### 800 ఏళ్ల నాటి శివాలయం కూల్చివేత

**ఆలయం కూల్చివేతపై హోరెత్తిన ఓరుగల్లు**
**ఘటనపై కేసు నమోదు చేసిన అధికారులు**
**మళ్లీ అదే ప్రాంతంలో నిర్మిస్తామని కలెక్టర్ క్లారిటీ**



**ముద్ర, వరంగల్ :** వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్‌నగర్‌లోని 800 ఏళ్ల నాటి పురాతన శివాలయాన్ని కూల్చివేశారనే ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. కాకతీయ రాజు గణపతిదేవుడి కాలానికి చెందిన ఈ ఆలయం స్కూల్ నిర్మాణ పనుల సందర్భంగా ధ్వంసమైందని స్థానికులు ఆరోపించారు. ఈ ఘటనపై మానవ హక్కుల న్యాయవాది ఇమ్మనేని రామారావు ఫిర్యాదు చేయడంతో అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఆలయాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చివేసిన ఆధారాలు లభించలేదని అధికారులు తెలిపారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం అది ప్రభుత్వ భూమేనని స్పష్టం చేశారు. స్థానికుల ఆగ్రహం నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శివాలయాన్ని అదే ప్రాంతంలో స్థపతులు, చరిత్రకారుల సూచనలతో పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే దానిని అధికారిక రక్షిత కట్టడంగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

**మూసీ నివాసితులకు డిప్యూటీ సీఎం భరోసా**

**ప్రజా భవన్‌లో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రుల భేటీ**




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మూసీ పునర్జీవన ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆస్తులు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం ప్రజా భవన్‌లో మూసీ పునర్జీవన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులను మధుపార్క్ రిడ్జ్ (బి-బ్లాక్) రెసిడెన్షియల్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ వినతులను మంత్రులకు సమర్పించారు. నివాసితులు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధుపార్క్ రిడ్జ్ బి-బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం అత్యంత సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ప్రభుత్వ హామీ పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. మూసీ పునర్జీవనానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరీ జి.వి. శేఖర్, సభ్యులు సత్యనారాయణ, గౌతమ్ రాయ్, రేణుధల్, నబీ సాహేబ్, సాహిల్ ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పక్షాన మూసీ ప్రాజెక్ట్ ఎండి ఈ.వి. నర్సింహారెడ్డి, జాయింట్ ఎండి గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి హాజరయ్యారు.

### బెల్లంకొండ సంపత్ నిబద్ధుడైన కవి




**ముద్ర, హైదరాబాద్ :** కవి, రచయిత, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ బెల్లంకొండ సంపత్ కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఘన అభినందన సభ నిర్వహించారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్తలు, కవులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టులు హాజరయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. నందిని సిధారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ తదితరులు సంపత్ కుమార్ సేవలను కొనియాడారు. వక్తలు మాట్లాడుతూ సంపత్ కుమార్ సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసిన కవి అని, సాహిత్యాన్ని బాధ్యతగా భావించి సమాజ మార్పు కోసం రచనలు చేశారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిగా ఆయన నిబద్ధత, వ్యక్తిత్వం ఎంతో ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో సంపత్ కుమార్ రచనలు, కవిత్వం, బాలసాహిత్యం, ఉపాధ్యాయ సేవలపై ప్రత్యేక సదస్సులు నిర్వహించారు. చివరగా తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెరసం జంట నగరాల శాఖ అధ్యక్షులు కందుకూరి శ్రీరాములు, డా. తూర్పు మల్లారెడ్డి, తిరునగరి శ్రీనివాస్, గడ్డం సులోచన, యరకల యాదయ్య, నక్క హరికృష్ణ, గుండెల్లి ఇస్తారి, రుద్రంగి రమేశ్ పాల్గొన్నారు.

### అల్ఫోర్స్‌లో రెండో రోజు సుందరకాండ ప్రవచన జ్ఞానయజ్ఞం



**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సుందరకాండ ప్రవచన జ్ఞానయజ్ఞం రెండో రోజు కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ సత్తు మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డితో కలిసి శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్తు మల్లేశం మాట్లాడుతూ ఇతిహాసాలలో సుందరకాండకు ప్రత్యేకమైన స్థానం ఉందని, ఇది మానసిక మరియు శారీరక శక్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. అల్ఫోర్స్ విద్యాసంస్థలు విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలకు వేదికగా నిలుస్తున్నాయని కొనియాడారు.

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ హనుమంతుడు సీతమ్మను కనుగొన్న ఘట్టం ద్వారా ఆయన బలం, భక్తి, ప్రేమ, గురుభక్తి వంటి విలువలను ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేదికను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నిర్వహించిన భజనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు ఉప్పల ఆంజనేయ ప్రసాద్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నగర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం భక్తులకు అల్పాహార ప్రసాదం అందజేశారు.

### బాలికపై పాస్టర్ అత్యాచారం

ముద్ర, అమరావతి : ఏలూరు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. బాలికపై చర్చి పాస్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. కామవరపుకోట మండలానికి చెందిన చౌటపల్లి రాంబాబు (42) చర్చి ఏర్పాటు చేసుకుని ప్రార్థనలు చేసేవాడు. ఈ క్రమంలో కూలి పనులు చేసుకునే ఓ కుటుంబం ఆయన వద్దకు వచ్చేది. ఆ కుటుంబానికి చెందిన బాలిక (14)పై కన్నేసిన పాస్టర్ తరచూ అత్యాచారానికి పాల్పడేవాడు. బాలికను బెదిరించడంతో ఆమె ఎవరికీ చెప్పలేదు. ఈ క్రమంలో బాలికకు నెలసరి రాకపోవటంతో గర్భనిరోధక మాత్రలను పాస్టర్ అధిక మోతాదులో వాడించాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితురాలు ఈ విషయాన్ని తల్లికి తెలిపింది. బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరులోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని.. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టినట్లు తడికలపూడి ఎస్సై వల్లీపద్మ తెలిపారు.

## బెంగాల్ సీఎంగా 'సువేందు అధికారి'

**బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా రికార్డ్**
**మమతకు డబుల్ షాక్.. బెంగాల్ సీఎం కుర్చీపై తన అనుచరుడే**
**కౌన్సిలర్ స్థాయి నుంచి సీఎం పీఠం వరకు..**
**తృణమూల్‌ను వీడి చరిత్ర సృష్టించిన సువేందు అధికారి**



**ముద్ర డెస్క్:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన సువేందు అధికారి బెంగాల్ కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. కోల్‌కతాలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రేపు జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ సహా పలువురు కేంద్ర మంత్రులు హాజరయ్యే అవకాశముంది.

సువేందు అధికారి రాజకీయ ప్రయాణం కౌన్సిలర్ స్థాయి నుంచి ప్రారంభమైంది. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన ఆయన, 1995లో కాంగ్రెస్ తరపున తొలిసారి కౌన్సిలర్‌గా గెలిచారు. అనంతరం తండ్రి సిసిర్ అధికారి తో కలిసి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరి పార్టీ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించారు.

2007 నాటి నందిగ్రామ్ ఉద్యమం సువేందు రాజకీయ జీవితాన్ని మలుపుతిప్పింది. భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ఆయన ముందుండి పోరాడి ప్రజాదరణ పొందారు. అదే సమయంలో మమతా బెనర్జీకి అత్యంత సన్నిహిత నేతగా ఎదిగారు. తర్వాత ఎంపీగా, మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

అయితే పార్టీలో అభిషేక్ బెనర్జీ ప్రాధాన్యం పెరగడం, అంతర్గత విభేదాలు తీవ్రం కావడంతో సువేందు 2020లో తృణమూల్ కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతా బెనర్జీను ఓడించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఇప్పుడు మరోసారి ఆమెను భవానీపూర్‌లో ఓడించి బెంగాల్ తొలి భాజపా ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించబోతున్నారు.

### అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్‌తో నగరాభివృద్ధికి భారీ అవకాశాలు

**మున్సిపల్ సెక్రెటరీ డాక్టర్ టి.కె శ్రీదేవి**





ముద్ర, హైదరాబాద్ : మున్సిపాలిటీల్లో కేవలం సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలకే పరిమితం కాకుండా అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్ ద్వారా నగరాభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని మున్సిపల్ పరిపాలన శాఖ సెక్రెటరీ డాక్టర్ టి.కె. శ్రీదేవి తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల సివిల్ కాంట్రాక్టర్ల సదస్సులో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు నాణ్యత ప్రమాణాలు, ప్లానింగ్, డాక్యుమెంటేషన్, సేఫ్టీ చర్యలపై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అమృత్, స్వచ్ఛభారత్ మిషన్, టీయూఎఫ్ఐడీసీ, అర్బన్ ఛాలెంజ్ పథకాల కింద సుమారు రూ.28 వేల కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.
వరంగల్ నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్ ద్వారా రూ.5200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే నగరాభివృద్ధిలో భారీ ప్రాజెక్టులు అవసరమని డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు రిటైర్డ్ ఇంజనీర్లు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

### వియట్ జెట్ కీలక ఒప్పందాలు

- భారత్-వియత్నాం సంబంధాలకు కొత్త ఊపు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** భారత్-వియత్నాం మధ్య విమానయాన, మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే దిశగా వియట్‌జెట్ కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. భారత ప్రముఖ సంస్థలు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్, బర్డ్ గ్రూప్‌లతో వ్యూహాత్మక భాగస్వామ్యాలకు సంతకాలు చేసింది. వియత్నాం అధ్యక్షుడు టో లామ్ భారత పర్యటన సందర్భంగా జరిగిన ఇండియా-వియత్నాం బిజినెస్ ఫోరంలో ఈ ఒప్పందాలు ఖరారయ్యాయి. ఈ ఒప్పందాల ద్వారా విమానాశ్రయ మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్, స్మార్ట్ ఎయిర్‌పోర్ట్స్, గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు, శిక్షణ, పర్యాటకం వంటి రంగాల్లో పరస్పర సహకారం పెరగనుంది. రెండు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి, ప్రజల అనుసంధానానికి ఇవి కొత్త అవకాశాలు తీసుకురానున్నాయి. వియట్‌జెట్ వైస్ చైర్మన్ దిన్ వియట్ ఫుయోంగ్ మాట్లాడుతూ భారత్, వియత్నాం మధ్య సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం వియట్‌జెట్ న్యూఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు తదితర భారత నగరాలను వియత్నాంతో అనుసంధానిస్తూ వారానికి సుమారు 80 విమానాలను నడుపుతోందన్నారు. ఇప్పటివరకు 25 లక్షలకు పైగా ప్రయాణికులకు సేవలు అందించినట్లు వెల్లడించారు.

### భద్రతా ప్రమాణాలతో ఎయిర్‌టెల్ కొత్త ఆవిష్కరణలు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఏఐ ఆధారిత సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, సంస్థల భద్రత కోసం ఎయిర్‌టెల్ బిజినెస్ 'ఎయిర్‌టెల్ సెక్యూర్ వర్క్‌ఫోర్స్' అనే కొత్త భద్రతా ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించింది. దేశంలో తొలిసారిగా ఏకీకృత జీరో ట్రస్ట్ ఆర్కిటెక్చర్ (ZTA) ఆధారంగా రూపొందించిన ఈ వ్యవస్థ, సంస్థలకు ఎండ్-టు-ఎండ్ సైబర్ రక్షణను అందిస్తుంది. డీపీడీపీ చట్టానికి అనుగుణంగా రూపొందించిన ఈ సేవ ద్వారా సంస్థలు తమ డేటా, వినియోగదారులు, పరికరాలను ఎప్పటికప్పుడు రక్షించుకోవచ్చని ఎయిర్‌టెల్ తెలిపింది. 24x7 నిపుణుల నిఘా, పాన్ ఇండియా నెట్‌వర్క్ సపోర్ట్‌తో భద్రతా వ్యయాల్లో 30 శాతం వరకు ఆదా సాధ్యమవుతుందని సంస్థ వెల్లడించింది.

## తెలంగాణ సొమ్ముతో కాంగ్రెస్ కార్యకలాపాలు

**కేంద్రమంత్రి బండి సంజయ్**
**రాష్ట్రాభివృద్ధికి మేం తెస్తోన్న నిధులు ఏఐసీసీకి వెళ్తున్నాయి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశ రాజధాని నుంచి తెలంగాణకు తాము నిధులు తెస్తుంటే.. కాంగ్రెస్ నేతలు ఆ సొమ్మును ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలకు పంపుతున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని నడుపుకోవడానికి తెలంగాణ సొమ్మును వినియోగిస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం రూ. వేల కోట్ల నిధులు ఇస్తుందన్న బండి సంజయ్.. ఆ నిధులతోనే రాష్ట్రం అంతో ఇంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కేంద్రం నిధులు ఇవ్వకుంటే తెలంగాణ అభివృద్ధి చెందే అవకాశమే లేదన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందు తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశీర్వా దం కోసం మోదీ హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. తమ నినాదం జై శ్రీరాం... జై తెలంగాణతో పాటు ఈ రాష్ట్రాన్ని అభి వృద్ధి చేయడమే అని స్పష్టం చేశారు. జై శ్రీరాం .. జై తెలంగాణ నినాదాలతో పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభ దద్దరిల్లుతుందని చెప్పారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాదిరిగా తనకు దోచుకోవడం తెలియదన్నారు. రైతులకు బేడీలు వేసి అరిగోస పెట్టడం తనకు తెలియదని చెప్పారు. డ్రగ్స్ తీసుకోవడం కూడా తమకు తెలియదని పేర్కొన్నారు. కాళేశ్వరం, ఈ ఫార్ములా, విద్యుత్ కొనుగోళ్ల అవినీతి తమకు తెలి యదన్నారు. ఫాంహౌస్ డ్రగ్స్ కేసులు కూడా తమకు తెలియదని చెప్పారు. మంది కొంపలు ముంచడం అసలే తెలియదంటూ కేటీఆర్‌కు చురకలు అంటించారు. నోరు అదుపులోకి పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు బండి సంజయ్ సూచించారు. నీ అహంకారంతోనే కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని విమర్శించారు. బీఆర్ఎస్ ఏం చేసినా అధికారంలోకి రావడం కల అన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే అని ఆయన జోస్యం చెప్పారు. మోదీ సభ తర్వాత రాష్ట్రంలో జరగబోయేది చూడండంటూ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు.

### గ్రీన్ టీ పరగడుపున వద్దు



ఉదయాన్నే ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగడం వల్ల కడుపులో ఎసిడిటీ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఏదైనా తిన్న తర్వాతే దీనిని తీసుకోవడం ఉత్తమం.

## మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి ఘన నివాళి



**ముద్ర, కాప్రా:** సీనియర్ కాంగ్రెస్ నేత, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా ఈసీఐఎల్ రాధిక చౌరస్తా వద్ద ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రాజిరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండారి రాజిరెడ్డి ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన మహానేత అని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాజకీయ జీవితాన్ని అంకితం చేశారని, ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యమైన నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, పలు అభివృద్ధి కార్యక్రమాలతో ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు మరింత సేవ చేయడం అందరి బాధ్యత అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, పార్టీ రాష్ట్ర నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- తెలంగాణ రైతు ఐక్యవేదిక**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది. అకాల వర్షాలతో తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిగా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేసింది.రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, లారీలు, హమాలీల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తూకం వేసిన వెంటనే రైతులకు కొనుగోలు రసీదులు ఇవ్వాలని, తాలు పేరిట రైతులను దోపిడీ చేస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేసి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

## రెడ్ క్రాస్ సభ్యులకు ఘన సన్మానం



**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:** క్లాస్మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "365 రోజులు – 365 ప్రోగ్రామ్స్"లో భాగంగా 128వ రోజు ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో సేవలందిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులను జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్, డీఈఓ రమేష్ కుమార్, లయన్స్ క్లబ్, వాసవి క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ క్లాస్మేట్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సమాజంలో పేదలకు సహాయం చేస్తూ సామాజిక బాధ్యతతో సేవలు అందించాలని యువతకు సూచించారు. సేవాభావంతో ముందుకు వచ్చే యువత సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు వాస రాఘవేందర్ మాట్లాడుతూ వేసవి కాలంలో రక్తం అవసరం అధికంగా ఉంటుందని, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కోరారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో క్లాస్మేట్ క్లబ్ రాష్ట్ర కార్యదర్శి కేపీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ కుమార్, కోశాధికారి కాజా, మండల విద్యాధికారి కురుమయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, వాసవి క్లబ్ ప్రతినిధి కొత్త బాలాజీ, రెడ్ క్రాస్ సభ్యులు రమేష్ రెడ్డి, పోల శ్రీను, డి. రాజయ్య, డి.వి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం వెల్ఫేర్ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ కార్యక్రమం



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూరు పట్టణంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ అతర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత టైలరింగ్, కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించి, అనంతరం 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, ఏఎంసి చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, అసోసియేషన్ ప్రెసిడెంట్ కమల్ అతర్, కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు.

## అడ్వాన్స్ డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** ఇంటర్మీ డియట్ అడ్వాన్స్ డ్ సప్లి మెంటరీ పరీక్షల నిర్వహ ణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూ ల్ కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 18 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ, డీఈఓ రమేష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువత మత్తు బారిన పడకుండా కట్టుదిట్టమైన చర్యలు

**- సీపీ సుమతి**

**మల్కాజిగిరి, ముద్ర ప్రతినిధి:**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీస్ కమిషనర్ బి. సుమతి తెలిపారు. ముఖ్యంగా దిల్‌సుఖ్ నగర్, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో విద్యార్థుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె, నేర నియంత్రణలో భాగంగా అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. అర్ధరాత్రి వేళల్లో విద్యార్థుల కదలికలను డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షించడంతో పాటు, పెట్రోలింగ్ సిబ్బందికి డ్రగ్ డిటెక్షన్ కిట్లు అందజేసి అనుమానాస్పద వ్యక్తులపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న సుమారు 3,200 సీసీ కెమెరాల్లో 70 శాతానికి పైగా పనిచేస్తున్నాయని, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించినట్లు పేర్కొన్నారు. సరూర్‌నగర్ పరిధిలోని హాస్టళ్లలో ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, హై-రిజల్యూషన్ సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

మత్తు పదార్థాల విక్రయాలకు కేంద్రాలుగా మారుతున్న పాన్ డబ్బాలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచామని, నిషేధిత పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత క్షణికానందం కోసం మత్తుకు బానిస కాకూడదని, ఎన్‌డీపీఎస్ కేసుల్లో చిక్కుకుంటే విద్య, ఉద్యోగం, విదేశీ అవకా శాలపై తీవ్ర ప్రభావం పడుతుందని సీపీ సుమతి పేర్కొన్నారు.




# ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

**- ఎస్పీ జానకి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి:**



మహబూబ్ నగర్ పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డుపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డి.జానకి సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదాలకు గల కారణాలను తెలుసుకుని పోలీసు అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పీ పలు సూచనలు చేశారు. రహదారిపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు అమర్చడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, డివైడర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదకర మలుపుల వద్ద ప్రత్యేక గుర్తులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం మరియు నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ అప్పయ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



### ఎల్‌ఆర్‌ఎస్ రుసుములపై 25 శాతం రాయితీ

**- మే 1 నుంచి జూలై 31 వరకు అవకాశం**

**- మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

తెలంగాణ ప్రభుత్వం 29-04-2026 తేదీన విడుదల చేసిన జీవో నం.131 ప్రకారం, అనుమతి లేని లేదా అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ రుసుములపై 25 శాతం రాయితీ కల్పిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ రాయితీ మే 1, 2026 నుంచి జూలై 31, 2026 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో తమ ప్లాట్లకు చట్టబద్ధత లభిస్తుందని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

ప్లాట్ యజమానులు అధికారిక ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్‌లో లాగిన్ అయి సంబంధిత ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మరిన్ని వివరాల కోసం టీపీబీవో వినోద్‌ను 9100565001 నంబర్‌లో సంప్రదించవచ్చని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

# జనగణనపై అవగాహన ర్యాలీ నిర్వహణ

**నాగర్ కర్నూల్, ముద్ర ప్రతినిధి:**



జనగణనపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా, శ్రీపురం కూడలి తదితర ప్రధాన వీధుల మీదుగా సాగింది. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అమరేందర్ మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి కుటుంబం తమ వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరారు. సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని స్పష్టం చేశారు. జనగణన ద్వారా విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, గృహనిర్మాణం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారిణి సుజాత, డీఈఓ రమేష్ కుమార్, డీఎంహెచ్‌వో రవి నాయక్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా రహిత భారతం కోసం కృషి చేయాలి

**- అదనపు కలెక్టర్ అమరేందర్**

**నాగర్‌కర్నూల్, ముద్ర ప్రతినిధి:**

2035 నాటికి తలసేమియా రహిత భారతదేశం లక్ష్యంగా అందరూ పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.అమరేందర్ అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన తలసేమియా అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలసేమియా అనేది వంశపారంపర్యంగా వచ్చే జన్యుపరమైన రక్త సంబంధ వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధిలో రక్తంలో హిమోగ్లోబిన్ సరిగా తయారుకాకపోవడంతో బాధితులు తరచుగా రక్తహీనతకు గురవుతారని చెప్పారు. రక్త పరీక్షల ద్వారా తలసేమియాను గుర్తించవచ్చని, తీవ్రతను బట్టి కొందరికి తరచూ రక్త మార్పిడి అవసరమవుతుందని వివరించారు. పెళ్లికి ముందు, గర్భధారణ సమయంలో రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా తలసేమియా వాహకులు, బాధితులను ముందుగానే గుర్తించవచ్చని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రవికుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ప్రదీప్ కుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ సృజన, పర్యవేక్షణ సిబ్బంది ఫసియుద్దీన్, కొత్త నిరంజన్, విజయ్ కుమార్, కొత్త బాలాజీ, సురేష్ కుమార్, కళ్యాణ్ కృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




## సైబర్ కేసుల్లో బ్యాంకుల సహకారం కీలకం

**- సీపీ రమేష్**

**ముద్ర, శేరిలింగంపల్లి:**

సైబర్ నేరాల దర్యాప్తులో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో సీపీ కార్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, ముఖ్యంగా మ్యూల్ అకౌంట్లపై నియంత్రణ, ఖాతాల ఫ్రీజ్–డిఫ్రీజ్ ప్రక్రియలు, బాధితులకు నగదు వాపసు, డిజిటల్ మోసాల దర్యాప్తు వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆన్‌లైన్ స్కామ్‌లు, నకిలీ పెట్టుబడి పథకాలు, క్రిప్టో కరెన్సీ మోసాలు, కాల్ సెంటర్ ఫ్రాడ్స్ కారణంగా ప్రజలు భారీగా నష్టపోతున్నారని తెలిపారు. సైబరాబాద్ పరిధిలో 2025లో రూ.438 కోట్లు, 2026లో ఇప్పటి వరకు రూ.104కోట్లు సైబర్ మోసాల ద్వారా కోల్పోయినట్లు వెల్లడించారు. ప్రతి బ్యాంకులో ప్రత్యేక సైబర్ సెల్స్ ఏర్పాటు చేసి ఫిర్యా దులపై వేగంగా స్పందించాలని సీపీ సూచించారు. ప్రజలు పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి సమాచారం తెలుసుకోవాలని, అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ డీసీపీ టి. సాయి మనోహర్, సీఎస్‌బీ ఎస్పీ సాయి పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో డీసీపీలు కోటి రెడ్డి, ఏ. ముత్యం రెడ్డి, టి. సాయి మనోహర్, సీఎస్‌బీ ఎస్పీ సాయిశ్రీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కోటక్ మహీంద్రా బ్యాంక్ తదితర బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



**గ్రీన్ టీతో గుండె ఆరోగ్యం:**



ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయ పడుతుంది. తద్వారా రక్త ప్రసరణ మెరుగు పడి గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది.

# పశు పోషణ పై ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లాలో అదనపు సబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, పెగడపల్లి:** పశు పోషణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం మద్దులపల్లి గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరానికి మంత్రి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పశుపోషణ చేస్తున్న రైతులకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పెగడపల్లి మండలంలో సుమారుగా 27 వేల గొర్రెలు, మేకలు, 6వేలకు పైగా ఆవులు, గేదెలు ఉన్నాయని మంత్రి తెలిపారు. జిల్లాలో పెద్ద ఎత్తున పశుపోషణ చేస్తున్న పెగడపల్లి మండలం పశు పోషకుల కోసం కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పెగడపల్లి మండలంలో పశువుల కొరకు వెటర్నరీ సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పశువులకు కావలసిన మందులను అందుబాటులో ఉంచుతామని మంత్రి తెలిపారు. పశువులకు సంబంధించిన ఇన్సూరెన్స్ విషయంలో ఉన్న సమస్యను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారితో మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రైతులు పశుసంపద పెంపు పై దృష్టి సారించాలని ఇందుకు ప్రభుత్వం తరపున పూర్తి ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

### యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు పరిశీలించిన మంత్రి ..

**ముద్ర, ధర్మపురి:** ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. మరో నెల రోజుల్లో వర్షాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట పెద్దపల్లి ఎంపీ తో పాటు నేరెళ్ల సర్పంచ్ బాలగౌడ్, ధర్మపురి ఏఎంసీ వైస్ చైర్మన్ నరసింహులు ఉన్నారు.

## బంద్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెడుతారా

**- రెండు పార్టీలు కావాలని దాడి చేసుకుని నాటకాలు..**

**- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్:** బంద్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టడం తగదని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీల వైఖరి నువ్వు కొట్టినట్టు చేయ్ నేను అరచినట్టు చేస్తా అన్న చందంగా ఉందన్నారు. రెండు పార్టీల నాయకులు వ్యక్తిగతంగా విమర్శలు చేసుకొని దాడులు చేసుకుని అందులో ఒక పార్టీ బంద్ కు పిలుపు ఇవ్వడం సిగ్గుచేటని మండిపడ్డారు.పరస్పరం రెండు పార్టీలు అవసరాన్ని బట్టి సహకరించుకుంటూ మళ్లీ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి డ్రామాలు ఆడుతున్నారని తెలిపారు. ఈ డ్రామాను రంజింపచేయడానికి బిఆర్ఎస్ పార్టీ బంద్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తుందని ఆరోపించారు.ఇప్పటికైనా పునరాలోచించి బంద్ కార్యక్రమాన్ని విరమించుకోవాలని నరేందర్ రెడ్డి సూచించారు.

## బంద్ కు నగర ప్రజలు సహకరించాలి

**- ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**ముద్ర, కరీంనగర్:** తన క్యాంపు కార్యాలయం పై దాడి ఘటనను నిరసిస్తూ శనివారం నిర్వహించనున్న కరీంనగర్ బంద్ కు నగర ప్రజలు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్యన వైరుధ్యం ఉండొచ్చు, భేదాభిప్రాయాలు ఉండొచ్చన్నారు. కానీ కరీంనగర్ చరిత్రలో ప్రప్రథమంగా తన క్యాంపు కార్యాలయం పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ బంద్ కు కరీంనగర్ నగర అన్ని వర్గాల ప్రజలతో పాటు, వ్యాపార వాణిజ్య సంస్థలు శాంతియుతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ బంద్ లో బీ ఆర్ ఎస్ పార్టీ శ్రేణులందరూ శాంతి యుతంగా పాల్గొని సహకరించాలని సూచించారు.

## బంద్ కు సహకరించకండి

**- బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**

**ముద్ర, కరీంనగర్:** బీఆర్ ఎస్ బంద్ కు నగర ప్రజలు సహకరించొద్దని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు కోరారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంటు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తన రాజకీయ ఉనికి, ప్రజల ఆదరణను కోల్పోయిందన్నారు. అందుకే కరీంనగర్ బంద్ పేరిట రాజకీయ డ్రామాలు మొదలుపెట్టిందని విమర్శించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సమర్థిస్తూ బీఆర్ఎస్ బంద్ కు పిలుపునిచ్చిందా అని ప్రశ్నించారు. హుజురాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న కౌశిక్ రెడ్డి , కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును రాజకీయ వేదికగా మార్చుకొని ఇష్టాను సారంగా, అడ్డగోలుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారన్నారు. అలాంటి వ్యాఖ్యలను బీజేపీ శ్రేణులు జీర్ణించుకోలేకనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని నిలదీయడానికి కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కు వెళ్లినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి , గొడవకు దారి తీసిందన్నారు. అసలు ఈ గొడవకు ప్రధాన కారణమైన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని బీబిఆర్ఎస్ సమర్థించేలా బంద్ కు పిలుపునివ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రభుత్వ అధికారిక కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసును రాజకీయ వేదికగా మార్చుకొని, స్థానిక కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై అనవసర వ్యాఖ్యలు చేయడమే తప్పయితే, కౌశిక్ రెడ్డిని సమర్థించేలా బీఆర్ఎస్ పార్టీ వ్యవహరించడం , తిరిగి కరీంనగర్ బంద్ కు పిలుపునివ్వడం శోచనీయమన్నారు. కౌశిక్ రెడ్డి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కేంద్ర మంత్రి బండి సంజయ్ పైచేసిన వ్యాఖ్యలను కరీంనగర్ ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన కోరారు.

## కౌశిక్ రెడ్డిపై దాడిని ఖండిస్తూ రాస్తారోకో



**ముద్ర, కోరుట్ల:** కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, హుజరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై దాడిని ఖండిస్తూ బీ ఆర్ ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చెల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశాల మేరకు శుక్రవారం కథలాపూర్ మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నిరసన తెలిపారురు. ఈ సందర్భంగా పలువురు బీ ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రోజు రోజుకు బీజేపీ నాయకుల ఆగడాలు ఎక్కువ అవు తున్నాయని తెలిపారు. బీజేపీ నాయకుల దౌర్జన్యాలు తక్షణమే ఆపాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కథలాపూర్ మండల మాజీ ఎంపీటీసీ మామిడిపల్లి రవి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం భూమారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వర్ రావు, మాజీ వైస్ ఎంపీపీ గంగ్ర కిరణ్ రావు, సర్పంచ్ లు, గ్రామ మండల స్థాయి వివిధ హోదా లో ఉన్న తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వీయ గణనపై అవగాహన ఉండాలి

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** స్వీయ గణనపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే జనగణనపై అవగాహనకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ పట్టణంలో భారీ మారథాన్ నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం నుండి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు నిర్వహించిన ఈ మారథాన్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రగతి, ప్రణాళికాబద్ధ అభివృద్ధికి జనగణన అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రక్రియ అన్నారు. జనాభా లెక్కల ఆధారంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు రూపొందించడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల ప్రణాళిక చేపడుతుందని వివరించారు. జనగణన–2027లో భాగంగా ప్రతి కుటుంబం తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవాలని కోరారు. అవగాహన లేని వారికి ఇతరులు సహకరించాలని, సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, సీపీఓ జీవరత్నం, డీవైఎస్ ఓ శ్రీకాంత్ రెడ్డి, డీఈఓ భోజన్న, ఎల్‌డీఎం రామ్ గోపాల్, డీపీఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ పీజీ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# గుండాలను ప్రోత్సహిస్తున్న బండి సంజయ్

**- బీఆర్ఎస్ నేత జీవీ రామకృష్ణరావు**

**ముద్ర, కరీంనగర్:** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ సైనికులకు బదులు గూండాలను ప్రోత్సహిస్తున్నారని బీఆర్ఎస్ నేత జీవి రామకృష్ణరావు ఒక ప్రకటనలో ఆరోపించారు. కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కరీంనగర్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా

కేటీఆర్‌పై బీజేపీ చేసిన ఆరోపణలకు ఇప్పటికే కేటీఆర్ సమాధానం ఇచ్చారని, కోర్టులు కూడా బీజేపీ ఆరోపణలను తప్పుపట్టాయని తెలిపారు. విమర్శలకు ప్రతివిమర్శలు ఉండాలని, కానీ భౌతిక దాడులు ప్రజాస్వామ్యంలో సరైన పద్ధతి కాదన్నారు. అయితే బీజేపీ కార్యకర్తలు మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ కూడా తగిన సమాధానం ఇస్తుందని హెచ్చరించారు. ఈ దాడుల వెనుక కాంగ్రెస్ హస్తం కూడా ఉందని జీవి రామకృష్ణరావు ఆరోపించారు. ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం చేసిన వ్యాఖ్యలే ఈ పరిణామాలకు కారణమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను జగిత్యాల మార్కెట్ యార్డులో శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో రాజకీయాలు చేయడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా పంటలకు మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా రూ.4వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోరి ముందుకు సాగుతుందని తెలిపారు. జగిత్యాల జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే పెద్ద ఎత్తున పంట దిగుబడులు వచ్చాయని పేర్కొన్నారు. జగిత్యాల మార్కెట్ యార్డులో గత ఏడాది 487 మంది రైతుల వద్ద 1151 మెట్రిక్ టన్నుల మక్కలు సేకరించగా, ఈ ఏడాది ఇప్పటికే 697 మంది రైతుల వద్ద 2607 మెట్రిక్ టన్నుల మక్కలు కొనుగోలు చేసి నట్లు మంత్రి వివరించారు. జిల్లా వ్యాప్తంగా కురిసిన అకాల వర్షానికి తడిసిన ధా న్యంతో పాటు మొక్కజొన్నలను కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని, కొంతమంది ప్రతిపక్ష నాయకులు తమ స్వార్ధ రాజకీయాల కోసం రైతులను వాడుకుంటున్నార న్నారు. రైతులు కష్టాల్లో ఉన్న సమ యంలో ప్రతిపక్ష నాయకులు రాజకీయాలు చేయడం తగదని మంత్రి హితవు పలికారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రైతులను ఏనాడు పట్టించుకోలేదని ఆరోపించారు. నాడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రైతులు వరి సాగు చేస్తే ఉరే అని అన్నారని గుర్తు చేశారు. మంత్రి వెంట జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జగిత్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలవాలి

**- టీడీపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్**



**ముద్ర, కోరుట్ల:** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని తెలుగుదేశం పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ డిమాండ్ చేశారు. గాలి దుమారంతో నష్టపోయిన రైతులను మానుక ప్రవీణ్ శుక్రవారం పరామర్శించారు. మెట్‌పల్లి మార్కెట్ యార్డులో తడిసిపోయిన ధాన్యం, నష్టపోయిన మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంతో పాటు మొక్కజొన్న పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి రైతుల సమస్యలకు త్వరితగతిన పరి ష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. “రైతు లేనిదే రాజ్యం లేదు” అనే నినాదాన్ని ఆచరణలో పెట్టి రైతు కుటుంబాల్లో మళ్లీ ఆనందం నింపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మారుతి, మహదేవ్, చందు, ఆసిఫ్, నజీమ్. పంట నష్టపోయిన రైతులు బద్దం లక్షపతి రెడ్డి, మిట్టపల్లి పద్మ, లోగిరి దేవయ్య, గుద్దేటి శివకుమార్, ఆనంద్, లత, శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ టీ చర్మ సౌందర్యం :



గ్రీన్ టీ తాగడం వల్ల వృద్ధాప్య ఛాయలు త్వరగా రావు. ఇది చర్మాన్ని లోపలి నుండి శుభ్రం చేసి కాంతివంతంగా మార్చుతుంది.

# మెగా జాబ్ మేళా ప్రారంభం

- ప్రముఖ కంపెనీలే వచ్చి ఉద్యోగావకాశాలు కల్పించడం శుభపరిణామం
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యువత ఉద్యోగ అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ప్రముఖ కంపెనీలే జిల్లా కేంద్రానికి వచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం శుభపరిణామమని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రముఖ వన్ ఎంవన్‌బీ సంస్థ సహకారంతో కుంభం ఫౌండేషన్ ఛైర్పర్సన్ కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా కార్యక్రమం భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ పాఠశాల ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ జాబ్ మేళా మే 8, 9, 10 తేదీలలో జరుగుతాయని దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రముఖ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 25 ప్రముఖ కంపెనీలు పాల్గొని దాదాపు 3500 ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయని చెప్పారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుప్పం, కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ ప్రాంతాల్లో విజయవంతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఈ సంస్థ, ఇప్పుడు తెలంగాణ యువత కోసం రాష్ట్రంలో మొట్ట మొదటిసారి యాదాద్రి భువనగిరిని వేదికగా ఎంచుకోవడం విశేషంగా నిలిచిందన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమా, ఇతర అర్హతలు కలిగిన యువతకు ఈ జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ప్రైవేట్ రంగంలోని ప్రముఖ కంపెనీలు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయన్నారు. జాబ్ మేళా మొదటి రెండు రోజులు మే 8, 9 తేదీలలో అభ్యర్థుల స్క్రీనింగ్, సర్టిఫికెట్ల పరిశీలన, టోకెన్ కేటాయింపు ప్రక్రియ అనంతరం మే 10న ప్రధాన ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని చెప్పారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతకు ప్రత్యేకంగా గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళా వేలాది మందికి ఉపాధి మార్గాన్ని చూపుతుందని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వలంటీర్లను అభినందించారు. 10న నిర్వహించనున్న ప్రధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి యువత, ప్రజలు, నిర్వాహకులు అందరూ సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అవేస్ చిస్తీ, భువనగిరి మున్సిపల్ ఛైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ ఛైర్మన్ పోతంశెట్టి మంజుల, పోచంపల్లి మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేష్, వార్డ్ కౌన్సిలర్ తాహీరా బబ్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



**ముద్ర సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా నూతన రెవెన్యూ అదనపు కలెక్టర్ బి.హరి సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌ను కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అదనపు కలెక్టర్ కు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ కు జిల్లా రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## కులాంతర వివాహ జంటలు ఆదర్శంగా ఉండాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ముద్ర, చిట్యాల :** కులాంతర వివాహాలు చేసుకున్న యువ జంటలు అందరికీ ఆదర్శంగా ఉండాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు యస్. వీరయ్య అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో జరిగిన ఎస్ ఎఫ్ ఐ నకిరేకల్ డివిజన్ అధ్యక్షులు అరూరి ప్రణీత్, శ్రీ వాణిల కులాంతర వివాహానికి వారు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులాంతర వివాహాలు సమాజంలో సామాజిక సమానత్వం ను పెంపొందిస్తాయని అన్నారు. ఆదర్శ వివాహంను అంగీకరించి పెండ్లికి ఒప్పుకున్న ఇరువురి కుటుంబాల తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, కెవిపియస్ రాష్ట్ర కార్యదర్శి టి స్కె లాబ్ బాబు, గ్రామ సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, బొజ్జ చిన్న వెంకులు, అవిశెట్టి శంకరయ్య, డివైయఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, సిపిఎం మండల నాయకులు అరూరి శ్రీను, పంది నరేష్, నెలికంటి నర్సింహా వివిధ ప్రజా సంఘాల నాయకులు అంతటి స్వామి, దేశబోయిన నర్సింహా,అరూరి శంభయ్య, సుర్కంటి మోహన్ రెడ్డి, అరూరి నర్సింహా, ఆడపు రమేష్, బొడ్డుపల్లి శ్రీను, గోలి సాయి కిరణ్, విఘ్నేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## టీజీఎస్పీఎఫ్ సిబ్బంది 10కే రన్

కొండ కింద స్వచ్ఛ భారత్




**ముద్ర, యాదగిరిగుట్ట:** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో టీజీఎస్పీఎఫ్ డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు, యాదగిరిగుట్ట ఆలయ భద్రతా విభాగం సిబ్బంది శుక్రవారం తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. అనంతరం కొండ కింద ఉన్న కల్యాణకట్ట వద్ద 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ఈవో భవాని శంకర్, ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్పీఎఫ్ ఇన్స్పెక్టర్ కే. శేషగిరి రావు తెలిపారు. ఎస్సై రవి, ఏఎస్ఐలు శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య, నాగేశ్వరరావు, సిబ్బంది మోహన్ రెడ్డి, రామ్మోహన్ రావు, గోపి నాయక్, రమేష్, సిద్ధులు, పాండు, సూరి నాయక్, మురళి, ధర్మేష్, తిరుపతి, అనిల్ పాల్గొన్నారు.

# యాదాద్రి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా



**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి స్థానిక నిరుద్యోగులకు చెందేలా నూతన టెండర్లు వేయాలని కోరుతూ యాదాద్రి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగులు శుక్రవారం హైదరాబాద్లోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ముందు ప్లకార్డులతో ధర్నా నిర్వహించి అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ రావు, రెవెన్యూ అండ్ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకుంటూ కొత్త వారికి అవకాశం ఇవ్వకుండా అధిక రేట్లకు అమ్ముతూ భక్తులను ఇబ్బంది పెడుతున్న వర్తకసంఘాన్ని తక్షణమే రద్దు చేస్తూ టెండర్లు వేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. గతంలో కేవలం 30,40 షాపులే ఉండగా రాజకీయ పలుకుబడితో వాటిని ఇప్పుడు 114 షాపులుగా పెంచారని, రాజకీయ, అధికార బలంతో ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారని మండిపడ్డారు. స్వామివారి అభివృద్ధిలో భాగంగా వీళ్లు ఎటువంటి ఆస్తులు కోల్పోలేదు, స్వామి వారి కోసం ఎంతోమంది వారి ఇండ్లను భూములను కోల్పోగా వారికి ఎటువంటి న్యాయం జరగలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వీరికి కొండక్రింద నూతనముగా కొన్ని కోట్లు ఖర్చు చేసి దుకాణాలను నిర్మించడం జరిగిందని, ఇట్టి వర్తక సంఘం వల్ల దేవస్థానానికి, భక్తులకు నష్టమే తప్ప లాభం లేదన్నారు. తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, బండ రామస్వామి, దేవపూజ అశోక్, పల్లపు బాలయ్య, దండబోయిన వీరేష్, పబ్బాల ఉప్పలయ్య, మిరియాల కృష్ణ, ఆకుల అనిల్, బండి అనిల్, వంగపల్లి అరుణ్, మందోజు నరేష్, కొన్నె సంజీవ, కర్రె ప్రవీణ్, దార నవీన్, గోపగాని ప్రసాద్, జోరిగళ్ల ప్రశాంత్, కర్రె శ్యామ్, గుండు కుమార్, ఆరె కుమార్, దార క్రిష్ణ, పల్లపు రాజు, శ్రీనాథ్, వంశీ, రాజు, విజయ్ పాల్గొన్నారు.

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి అన్నారు. శుక్రవారం తన ఛాంబర్ లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 21 వరకు ఇంటర్ మొదటి, సంవత్సరం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రథమ సంవత్సరం లో 3,936 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని, ద్వితీయ సంవత్సరంలో 1,691మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. మొత్తం 5,627 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అందుకు 17 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ లక్ష్మీ నారాయణ, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి సురేష్, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ సంపూర్ణ,ఆర్టీసీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం



రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకా రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలో శుక్రవారం అంతర్జాతీయ రెడ్ క్రాస్ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి జాతీయ పతాకంతో పాటు రెడ్ క్రాస్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1863లో హెన్రీ డ్యునాంట్ చే స్థాపించబడిన ఈ సంస్థ యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధుల సమయంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా బాధితులకు సేవలందిస్తోందని తెలిపారు. రెడ్ క్రాస్ జిల్లా కమిటీ ఛైర్మన్ గుర్రం లక్ష్మీ నర్సింహారెడ్డి, డివిజన్ కమిటీ ఛైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి కార్యక్రమంలో జిల్లా కమిటీ వైస్ ఛైర్మన్ దిడ్డి బాలాజీ, జిల్లా కమిటీ డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,జంపాల అంజయ్య, రాంబాయి, కార్యదర్శి క్రిస్టోఫర్, డివిజన్ కమిటీ డైరెక్టర్ ఐలేని రామ్ రెడ్డి,లావణ్య,రెడ్ క్రాస్ సభ్యులు కరిపె నర్సింగ్ రావు, బండారు శ్రీనివాస్, బిజ్జాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# హత్య కేసులో నలుగురికి జీవిత ఖైదు

జిల్లా ఎస్పీ కె నర్సింహా



**ముద్ర, సూర్యపేట జిల్లా ప్రతినిధి:** మంత్రాల నెపం, భూవివాదం ఘటనలో 2015 లో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు హుజూర్ నగర్ రెండవ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జ్ కోర్టు జీవిత ఖైదు విధించినట్లు ఎస్పీ నరసింహ వెల్లడించారు. గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామంలో యెడిపాల వీరారెడ్డి, యెడిపాల లింగారెడ్డి పాలివారి రెండు కుటుంబాల మధ్య భూ వివాదం వల్ల ఇరు కుటుంబాలు తరచూ గొడవపడేవారు. వీరిలో లింగారెడ్డి కుమారుడు అనారోగ్యానికి గురికావడానికి కారణం వీరారెడ్డి మంత్రాలు చేస్తున్నాడని నమ్మకంతో హత్య చేశారు. 2015 సంవత్సరం జూలై 19 సాయంత్రం 5 గంటల సమయంలో వీరారెడ్డి పొలంలో మోటర్ బందు చేసి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో వీరారెడ్డి గురించి వెతికిన అతని ఆచూకీ లభించలేదు. జూలై 20న వీరారెడ్డి కుమారుడు వీర భాస్కర్ రెడ్డి గరిడేపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా 21న సాయంత్రం వీరారెడ్డి మృతదేహం రిజర్వాయర్ లో గన్ని బ్యాగులో లభించింది. మిస్సింగ్ కేసును హత్య కేసుగా తిరగరాసి అప్పటి హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తదుపరి విచారణ చేపట్టి యెడిపాల లింగారెడ్డి, యెడిపాల సత్యనారాయణ రెడ్డి, యెడిపాల ఉపేందర్ రెడ్డి, యెడిపాల సైదిరెడ్డి నలుగురు నిందితులను అరెస్టు చేసి నేరానికి పాల్పడినారని బలమైన ఆధారాలు, సాక్షాధారాల తో నేరాభియోగ పత్రాలను కోర్టుకు అందజేశారు. హత్య కోసం ఉపయోగించిన రెండు మోటార్ సైకిళ్ళు, రెండు ఐరన్ రాడ్స్, హెక్స్–ల్ బ్లేడ్, రాయి, పార ను స్వాదీనపర్చుకున్నారు. 16 మంది సాక్షులను విచారించి, కేసు ఆధారాలను పరిశీలించిన హుజూర్నగర్ కోర్టు న్యాయమూర్తి నిందితులు నలుగురు నేరానికి పాల్పడ్డారని నిర్ధారించి జీవిత ఖైదు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు. కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో హుజూర్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు పర్యవేక్షణలో సాక్షులను హాజరుపర్చారు. బాధితుల తరపున కేసును పీపీ బొబ్బ కోటిరెడ్డి వాదనలు వినిపించారు. గరిడేపల్లి ఎస్ఐ నరేష్, కోర్టు కానిస్టేబుల్ లు సైదులు, రాము కోర్టు అధికారులతో సమన్వయంగా పని చేశారు.

## గ్యాస్ ధర పెంచి ప్రజలపై భారం మోపుతున్న కేంద్రం

సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** అంబానీ ఆదాని కార్పొరేట్ ఆస్తులను కాపాడటమే నరేంద్ర మోడీ కర్తవ్యం అని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు విమర్శించారు పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డిమార్ట్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నిత్యవసర వస్తువుల పైన పెట్రోల్, డీజిల్ పైన గ్యాస్ పైన ధరలు పెంచి సామాన్యుల పై అధిక భారం వేసారని అన్నారు.19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధర ఒక్కసారిగా 993 రూపాయలు పెంచడం అత్యంత దుర్మార్గం అన్నారు. దీనితో హోటలు టిఫిన్ సెంటర్లో చిన్న వ్యాపారపై పెనుబారం పడుతుందని దాని ద్వారా నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశానికి అంటుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సూర్యాపేటలో గత కొన్ని మాసాలుగా గ్యాస్ వినియోగదారులు సకాలంలో గ్యాస్ సిలిండర్ సరఫరా కాకపోవడం వల్ల వినియోగదారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు అలాగే పెట్రోల్, డీజిల్ , గ్యాస్ యజమానులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ తరలించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు కావున అధికారులు తగిన చర్యలు చేపట్టాలని తనిఖీలు నిర్వహించాలని ప్రజలు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యవర్గ సభ్యులు మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, మైనార్టీ జిల్లా నాయకులు ఎండి పాషా, ఏఐవైఎఫ్ గౌరవ అధ్యక్షులు కుక్కడప్పు శౌరి, అధ్యక్షులు బూర సైదులు, కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, ఎస్.కె మదర్ పాల్గొన్నారు.

## మోడీ సభ జయప్రదం చేయాలని బీజేపీ బైక్ ర్యాలీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఈనెల 10న సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో జరగబోయే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు రత్నాపురం బలరాం ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి సావర్కర్ చౌరస్తా నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జైనపల్లి శ్యామ్ సుందర్ రెడ్డి, పాశం భాస్కర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయా దశరథ, సుర్వి శ్రీనివాస్, కౌన్సిలర్ బండారి స్వర్ణలత, పట్టణ ప్రధాన కార్యదర్శిలు ఉడుత భాస్కర్, బొర్ర రాకేష్, యువర్ మోర్చా జిల్లా అధ్యక్షులు పట్నం కపిల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నపురం శ్రీశైలం, పట్టణ ఉపాధ్యక్షులు కొల్లోజు సతీష్, ఎదగని సంతోష్, యాట వెంకటేష్, కారుపాటి రాజు, యువమోర్చా అధ్యక్షులు కానుకుంట్ల రమేష్ , ఎంజాల రాంప్రసాద్, ఎంజలా మల్లిక, తడూరి రాజు,పవన్,భరత్ పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే సభ్యత్వ క్యాంపెయిన్ కు స్పందన

టీయూడబ్ల్యూ జే ఐజేయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్) ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సభ్యత్వ క్యాంపెయిన్ కు విశేష స్పందన లభిస్తుందని టీయూడబ్ల్యూజే ఐ జే యు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సభ్యత్వ క్యాంపెయిన్ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. యూనియన్ సభ్యత సేకరణ అనంతరం జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ బంటు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయకుమార్, జిల్లా ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రవీందర్ శర్మ, తండు వెంకటేష్ గౌడ్, ఖలీల్ అహ్మద్, పులుసు నాగరాజు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి పరచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు వారము" కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లాలో మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి పరచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. రైతులు, మత్స్యకారులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. మత్స్య శాఖ అధికారి రాజారామ్, సైంటిస్ట్ నాగరాజు, కో–ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్టర్ వెంకట్రెడ్డి, మత్స్యకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### జనగణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ

యాదాద్రి భువనగిరి జిల్లాలో జనగణన – 2027 మరియు స్వీయ గణనకు సంబంధించి అవగాహన ర్యాలీని శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ప్రతి కుటుంబం సరైన సమాచారం అందించి జనగణన స్వీయ గణన కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆర్డీవో కృష్ణారెడ్డి , సీపీఓ కార్యాలయ సిబ్బంది, సెన్సస్ అధికారులు పాల్గొన్నారు.

## సీతారాములు మృతి తీరని లోటు

**ముద్ర, ఖమ్మం :** సింగరేణి గ్రామం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గంగరబోయిన సీతారాములు మృతి సంఘానికి తీరని లోటు అని ఖమ్మం జిల్లా ముదిరాజ్ యువ ఐక్యవేదిక సంఘ యువజన నాయకులు పిట్టల శ్రీకాంత్ రాజా అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం సీతారాములు మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ రాజా గ్రామానికి వెళ్లి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీతారాములు అకాల మృతి తీరని లోటు అని పిట్టల శ్రీకాంత్ రాజా తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో సింగరేణి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తురక రాంబాబు, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సింగరేణి అధ్యక్షులు తురక సాంబయ్య, కార్యదర్శి చింతల సంపత్ కుమార్, సింగరేణి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, ముదిరాజ్ సంఘం నాయకులు తురక నారాయణ, పెద్దమ్మ సత్యం గారు, తురక రాజు, తురక రవి, తురక మల్లేష్, పెద్దమ్మ మల్లేష్, గిరిపోయిన వెంకన్న, గొడుగు శ్రీనివాస్, గంగరబోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 09.05.2026
www.mudranews.in | @mudranews



**గ్రీన్ టీ తో మెదడు చురుకుదనం:**

ఇందులో ఉండే కెఫీన్ మరియు 'ఎల్-థియనైన్' ఏకాగ్రతను పెంచుతాయి. ఇది మెదడును ప్రశాంతంగా ఉంచి ఒత్తిడిని తగ్గించ డంలో తోడ్పడుతుంది.

# మత్స్య కార్మికులకు పెద్దపీట

**- అదనపు కలెక్టర్ నగేష్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కార్మికులకు పెద్ద పీట వేస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులకు జిల్లా స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా మత్స్యశాఖ ఇంచార్జి గడప దేవేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ మత్స్య సంపదను పరిరక్షించడం ద్వారా మత్స్యకారుల ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మత్స్య కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని ప్రతి మత్స్యకారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో చేపలకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు. మత్స్య సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గడప దేవేందర్ మాట్లాడుతూ ప్రతి మత్స్యకారుడు ప్రకృతి సంపదను కాపాడే బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, రుణ సౌకర్యాలు, బీమా పథకాలు, మత్స్యకార భరోసా పథకాల గురించి వివరించారు.

**పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలం..**

పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలం అని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. నర్సాపూర్ మండలంలోని రామచంద్రాపూర్ గ్రామంలో పశు చికిత్స, అవగాహన శిబిరం నిర్వహించారు. అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించి, దూడలు, గొర్రెలు, మేకలకు నులిపురుగుల నివారణ మందులు వేయించారు. అనంతరం ఖనిజ మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేశారు. ఈ శిబిరం ద్వారా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించారు. ఇందులో భాగంగా పశువులకు వైద్య సేవలు అందించగా, రైతులు పాల్గొని ఈ సేవలను సద్వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పశువులకు సమయానికి టీకాలు వేయించాలని సూచించారు. పోషకాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశువుల్లో వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశు వైద్య అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, అధికారులు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చివరి గింజ వరకు కొంటాం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. శుక్రవారం మెదక్ మున్సిపల్ పరిధిలోని అవుసులపల్లి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కౌడిపల్లి మండలంలో ధాన్యం రవాణా పరిశీలించారు. ధాన్యం తూకం, రికార్డులు, ట్యాబ్ ఎంట్రీ, లోడింగ్ ప్రక్రియ, తేమ శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం రవాణా విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన పడాల్సిన పని లేదన్నారు. అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లోడింగ్ ప్రక్రియను త్వరగా చేపట్టాలన్నారు. లేబర్ ను, లారీలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం ఉండాలని నిర్వాహకులకు సూచించారు. మిల్లర్లు ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను త్వరగా చేసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, సివిల్ సప్లై డీఎం జగదీష్ తదితరులు ఉన్నారు.

**సరిపడా సిబ్బందిని నియమించాలి..**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా సిబ్బందిని నియమించాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. కౌడిపల్లి మండలం మహ్మద్ నగర్ లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, రవాణా వేగంగా జరగాలని సూచించారు. కేంద్రాలలో, మిల్లుల వద్ద ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే రాత పూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

## 533 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**- కలెక్టర్ ప్రతిమాసింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
జిల్లాలో 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతుల వద్ద నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా కార్యాచరణ రూపొందించామన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో ధాన్యం తూకం, రవాణా ప్రక్రియ కొనసాగిస్తామన్నారు. హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 67,489 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చెసి 62.87 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలని కేంద్రాల నిర్వహకులకు సూచించారు. జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. టార్పాలిన్లు 15,540, తూకం వేసే యంత్రాలు 668, ప్యాడీ క్లీనర్లు 278, తేమ శాతం చూసే మెషిన్లు 664 అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం అమ్మాలని కలెక్టర్ సూచించారు.

## సీపీఎం సమావేశాలను జయప్రదం చేయాలి

**- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు**



**ముద్ర ప్రతినిధి, సిద్ది పేట:**
జిల్లా కేంద్రంలో ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాల స్వామి అధ్యక్షతన సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చుక్క రాములు మాట్లాడుతూ సీపీఎం నిరంతరం పాలకుల అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు ప్రతిఘటిస్తూ అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. దేశంలో ఫాసిస్టు, మతోన్మాద శక్తులు అన్ని స్థాయిల్లో విస్తరిస్తున్నాయన్నారు. ఈ రాజకీయ వాతావరణంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం అతి ముఖ్యమైన రాజకీయ కర్తవ్యంగా భావించాలన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర, సెక్యులర్ శక్తుల బలోపేతం కోసం ఐక్య పోరాటాలు నిర్మించేందుకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం, లౌకికతత్వం పరిరక్షణ కోసం, దేశ రక్షణ కోసం అమెరికా సామ్రాజ్యవాదుల పట్టు నుండి దేశాన్ని రక్షించడం కోసం శ్రామిక ప్రజలను విశాల ఉద్యమాల నిర్మాణానికి సమీకరించడమే లక్ష్యంగా రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి పోరాడుతామన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు సిద్దిపేటలో మొదటి సారి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా సీపీఎం పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు, ఏ.విజయ రాఘవన్ హాజరవుతున్నారని చెప్పారు. వీరితోపాటు కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, 33 జిల్లాల నుంచి రాష్ట్ర నాయకులు, వివిధ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాల ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. ఆహ్వాన సంఘం చైర్మన్ గా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, ప్రధాన కార్యదర్శిగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కోశాధికారిగా కాముని గోపాలస్వామి, ముఖ్య ఉపాధ్యక్షులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, ఉపాధ్యక్షులుగా రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుబర్ల భాస్కర్, కార్యదర్శులుగా కొంగరి వెంకట మావో, చొప్పరి రవికుమార్ లను నియమించారు.

## కలెక్టరేట్ ఎదుట ధర్నా



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ధాన్యం కొనుగోలులో జాప్యం నిరసిస్తూ మెదక్ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. కలెక్టరేట్ ముందు ధాన్యం పోసి నిరసన తెలిపారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రెండు నెలలు కావస్తున్నా ధాన్యాన్ని తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వెంటనే ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి లారీలను పంపించాలన్నారు. ధర్నాలో కాంగ్రెస్ పార్టీ మెదక్ మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు వెంకట్, రాజు గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ వచ్చి వారిని సముదాయించారు.

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ముద్ర, హైదరాబాద్:** అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్కరించుకుని నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో శుక్రవారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మత్స్య ప్రగతి, ప్రణాళిక సమావేశం నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ ఉమారాణి తదితరులు విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మత్స్యకారులకు జిల్లాలో పుష్కలంగా జల వనరులు, చెరువులు ఉన్నాయని, ఇక్కడి నుండే చేప పిల్లల పెంపకం చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని చెప్పారు. మత్స్యకారులకే కాకుండా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తింపజేస్తామన్నారు.

అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు ప్రాధాన్యతనిస్తూ, వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

**ముద్ర, హైదరాబాద్:**
అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. జుక్కల్ నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతిని పొంగులేటికి వివరించారు. అంతే కాకుండా నియోజకవర్గానికి కావాల్సిన అవసరాల గురించి మంత్రికి వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు, పోడు భూముల క్రమబద్ధీకరణ, ఎల్లారం తండాకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల సమస్యను వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి పొంగులేటి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. వారి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు.

## కొండపాకలో పశువైద్య శిబిరం

**ముద్ర ప్రతినిధి, సిద్ది పేట:**
జిల్లాలోని కొండపాక మండల కేంద్రం లో శుక్రవారం ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు, గేదెలకు గర్భకోశ సంబంధ చికిత్సలు నిర్వహించారు. సబ్సిడీ పై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన, డీఏఓ స్వరూపరాణి, డీవీఏహెచ్ఓ గోపాల కృష్ణ మూర్తి, విజయ డెయిరీ డీడీ నాగేశ్వర్ రావు, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదింటి పెళ్లికి చేయూత



**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట:** సిద్దిపేట రూరల్ మండలం రావురూకలలో పేద కుటుంబానికి చెందిన కుపిరాల మణెమ్మ – భూదయ్య దంపతుల కుమార్తె జయశ్రీ వివాహానికి మాజీ కౌన్సిలర్, బీ ఆర్ ఎస్ నాయకులు దంపతులు ధర్మవరం స్వప్న – బ్రహ్మం పుస్తె మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మవరం బ్రహ్మం మాట్లాడుతూ పేద ఆడపిల్లల వివాహాలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. సమాజ సేవలో భాగంగా అవసరమైన వారికి చేయూత అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సాయం చేసిన స్వప్న – బ్రహ్మం దంపతులకు మణెమ్మ, భూదయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెళ్లి కుమార్తె సోదరుడు బాణుకుమార్ పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ముద్ర, హైదరాబాద్:** కామారెడ్డి జిల్లా పోల్కంపేట మండలంలోని పోల్కంపేటలో గ్రామస్థుల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ దివిటి రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా బాటసారులు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా పంచాయతీ నిధులతో మంచినీటి సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad–500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad–500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com